

ప్రచారంలో బతుకమ్మలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

# వచ్చేదీ, ఇచ్చేదీ కేసీఆరే..

- బీఆర్ఎస్ గెలిస్తే అర్హులందరికీ రూ.400కే వంట గ్యాస్
- అభివృద్ధి చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఇంటింటి ప్రచారంలో సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి టౌన్, అక్టోబర్ 20: తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కేసీఆరేనని, సంక్షేమ ఫలాలు ఇచ్చేదీ కేసీఆరేనని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఇటీవల విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం తదుపరి ఎన్నికల్లో గెలిచిన వెంటనే అర్హులందరికీ రూ.400కే వంట గ్యాస్ సిలిండర్లు అందుతాయని అన్నారు. సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 1 నుంచి 5, 12 నుంచి 17 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, తనకు అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి రైతుకూ ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుబంధును ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి.. కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో గెలిచిన వెంటనే రైతుబీమా మాదిరిగా కేసీఆర్ బీమా పేరిట రాష్ట్రంలోని అర్హులందరికీ రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని అందించనున్నన్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితిని కూడా రూ.15 లక్షలకు పెంచనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని ఇలాంటి హామీలను చూసిన ప్రతిపక్షాలకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ గ్యారెంటీ హామీలను, మాయమాటలను ప్రజలెవరూ నమ్మడం లేదని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేశ్, వనమా వాసు, మట్టా ప్రసాద్, కంటే నాగలక్ష్మి, గఫార్, వీరపనేని రాధిక బాబీ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత హనుమాన్ టెంపుల్‌లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

**జీవన్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఖండన**

కాగా, తెలంగాణ ప్రజలు ఎంతో పవిత్రంగా భావించే బతుకమ్మ, గౌరమ్మలపై కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఎమ్మెల్యే సండ్ర మండిపడ్డారు. రాజకీయంగా విమర్శలు చేయవచ్చుగానీ.. తెలంగాణ ఆడబిడ్డల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడం సరికాదని అన్నారు.

# భవిష్యత్తు బీఆర్ఎస్‌దే..

- కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావడం ఖాయం
- బీఆర్ఎస్‌లో చేరికల సభలో వైరా అభ్యర్థి మదన్‌లాల్

కొణిజర్ల, అక్టోబర్ 20: భవిష్యత్తు అంతా బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పార్టీ వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ పేర్కొన్నారు. కేసీఆర్ కూడా హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. మండలంలోని తనికెళ్లకు చెందిన 4వ వార్డు సభ్యుడు లేడిబోయిన వెంకటేశ్వరరావు (సీపీఐ), 5వ వార్డు మెంబర్ పొట్లపల్లి చిన్నవెంకయ్య (కాంగ్రెస్)తోపాటు పలువురు నాయకులు.. స్థానిక సర్పంచ్ చల్లా మోహన్‌రావు నేతృత్వంలో మదన్‌లాల్ సమక్షంలో తనికెళ్లలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మదన్‌లాల్ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా సాగాలంటే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు వై.చిరంజీవి, చల్లా మోహన్‌రావు, చల్లా నరసింహారావు, గుమ్మలపుడి శ్రీనివాసరావు, పొట్లపల్లి వెంకన్న, ఆకుతోట పుల్లారావు, కొర్లకంటి రవి, కమటాల ఎల్లయ్య, చెరుకుమల్లి రవి, అన్నారపు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, యాసా తిరుపతిరావు, లేడిబోయిన వెంకటేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి మదన్‌లాల్

# మార్కెట్ తరలకుండా కావలి కాశా

- కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నా
- ఏఎంసీ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేశా
- బీఆర్ఎస్‌కేవీ ఆత్మీయ సమ్మేళనం మంత్రి పువ్వాడ
- కాంగ్రెస్‌కు ఖమ్మం రెండో ప్రాధాన్యమేనని విమర్శ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 20: ఖమ్మం త్రీటౌన్‌కు గుండెకాయ లాంటి వ్యవసాయ మార్కెట్‌ను ఇక్కడి నుంచి తరలించేందుకు కొందరు నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తే.. అది తరలిపోకుండా తాను కావలికాశానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. ఖమ్మం ఏఎంసీ కార్మికులను కూడా తాను కంటికి రెప్పలా కాపాడుకున్నానని వివరించారు. బీఆర్ఎస్‌కేవీ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్మిక విభాగం ఆధ్వర్యంలో కార్మిక నేత, ట్రాలీ వర్కర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నున్నా మాధవరావు అధ్యక్షతన ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. గతంలో అనేకమంది నాయకులు ఈ మార్కెట్‌ను వేరే ప్రాంతానికి తరలించేందుకు విశ్వప్రయత్నం చేశారని గుర్తుచేశారు. కానీ తాను వారి కుట్రలను తిప్పికొట్టి మార్కెట్‌ను కాపాడుకున్నానని అన్నారు. అంతేగాక మార్కెట్ అభివృద్ధికి ఏకంగా రూ.10 కోట్ల నిధులను మంజూరు చేశానని, అభివృద్ధి పనులు ప్రారంభించానని వివరించారు. కాంగ్రెస్ నాయకులు ఖమ్మంపై కపట ప్రేమను చూపుతున్నారని, ఖమ్మం నియోజకవర్గం వారికి రెండో ప్రాధాన్యం మాత్రమేనని విమర్శించారు. కానీ ఇక్కడే పుట్టి ఒక్కడే పెరిగిన తాను ఖమ్మాన్నే మొదటి ప్రాధాన్యంగా భావించి వందల కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దానని వివరించారు. కార్మికుల కుటుంబాల వారంతా తమ చుట్టుపక్కల వారికి ఖమ్మం అభివృద్ధి గురించి వివరించాలని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి మెజార్టీ అందేలా చూడాలని కోరారు. అనంతరం, ఈ ఎన్నికల్లో మంత్రి పువ్వాడకే మద్దతు ఇస్తున్నట్లు ట్రాలీ వర్కర్స్, హమాలీ, దడవాయిలు, రైస్‌మిల్, దాల్ మిల్ తదితర అసోసియేషన్ల కార్మికులంతా కలిసి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తదుపరి మంత్రి అజయ్‌కు హామీ ఇచ్చి ప్రతిజ్ఞ చేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, వివిధ సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, పునుకొల్లు నీరజ, పగడాల నాగరాజు, చిన్ని కృష్ణారావు, బచ్చు విజయ్‌కుమార్, తోట వీరభద్రం, మన్నెం కృష్ణ, ముత్యం ఉప్పల్‌రావు, ఎర్రా అప్పారావు, గీతా వెంకన్న, పత్తిపాక రమేశ్, మరాటి యాదయ్య, సైదిరెడ్డి, మోటె కుమార్, కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పనిచేశా..

ఖమ్మం, అక్టోబర్ 20: ఖమ్మం ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడేలా పనిచేశానని మంత్రి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలనూ ప్రజల ఇంటికి వెళ్లి చేరవేశానని గుర్తుచేశారు. ఖమ్మం 10వ డివిజన్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధిని మాత్రమే కాంక్షించానని, రాష్ట్ర మంత్రిగా ఉన్న కూడా ఖమ్మం అభివృద్ధిపైనే అత్యధిక ఫోకస్ పెట్టానని, హైదరాబాద్‌కు దీటుగా తీర్చిదిద్దానని వివరించారు. పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, రమాదేవీ సతీశ్, పాషా, వంగవీటి శ్రీను, పారా నాగేశ్వరరావు, దిలీప్, జాబిశెట్టి శ్రీనివాస్, అప్పారావు, పగడాల నాగరాజు పాల్గొన్నారు.

# ‘మధిర’లో ఎగిరేది గులాబీ జెండానే..

- బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు



మధిర బీఆర్ఎస్ యువజన, సోషల్ మీడియా బాధ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజు

మధిర, అక్టోబర్ 20: రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మధిర గడ్డపై ఎగిరేది గులాబీ జెండాయేనని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అలాగే, బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని, ఆ పార్టీ మోసపు మాటలను ప్రజలకు వివరించాలని సూచించారు. మధిర వర్తక సంఘం కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి యువజన విభాగం సోషల్ మీడియా విభాగ సమావేశానికి ఆయన హాజరయ్యారు. సోషన్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి, యువజన విభాగం కన్వీనర్ కూన నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమల్‌రాజు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఈ నియోజకవర్గానికి విజిటర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తన అవసరాల కోసం, తన పదవిని కాపాడుకోవడం కోసం హైదరాబాద్‌కే పరిమితమైతే ఇక్కడి ప్రజలను విస్మరిస్తున్నారని విమర్శించారు. విజిటర్‌గా వచ్చిపోయే ఎమ్మెల్యేను కాకుండా నిత్యం ప్రజలతో మమేకయ్యే తనను గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కన్వీనర్ దినేశ్‌చౌదరి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం వేదికగా ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. యువజన విభాగం నేతలు చింతనిప్పుల కృష్ణచైతన్య, షేక్ నజీర్, ముడావత్ సైదా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పథకాలకు ఆకర్షితులయ్యే అనేకమంది పార్టీలోకి వస్తున్నారు
- ఎవరెన్ని దండయాత్రలు చేసినా అంతిమ విజయం బీఆర్ఎస్‌దే
- బీఆర్ఎస్‌లో చేరికల సభలో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 20: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే అనేకమంది ప్రజలు పార్టీలకు అతీతంగా వచ్చి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. తిరుమలాయపాలెం మండలం ఏనుకుంట తండాకు చెందిన బాణోత్ బావుసింగ్, రమేశ్‌తోపాటు వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాల వారు ఖమ్మం రూరల్ మండలం సాయిగణేశ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కందాళ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చేసే వారెవరో, మాయమాటలు చెప్పే వారెవరో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఎవరు ఎన్ని దండయాత్రలు చేసినా అంతిమ విజయం బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. మాయమాటలకు, గారడీలకు ప్రజలు మోసపోరని అన్నారు. మండల నేతలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616